# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పాకిస్తాన్‌తో జరిగే చర్చలు ఉగ్రవాదం గురించి మాత్రమే జరుగుతాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.**
2. **స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్‌ఆర్థర్ కాటన్ చేసిన కృషి మరువలేనిదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఇంటింటికి కుళాయి పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు.**
4. **రాష్ట్రంలో సైబర్ భద్రత సేవలను మరింత విస్తృతం చేస్తామని రాష్ట్ర సాంకేతిక సేవలు- ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు.**
5. **చేనేత కార్మికుల కోసం ఆరోగ్య భీమా పథకాన్ని వచ్చే నెల నుంచి అమలు చేస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు.**

==========================

జమ్మూకాశ్మీర్‌లో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు పర్యటించారు. పర్యటనలో భాగంగా శ్రీనగర్‌లోని భారత సైనిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భారత సైనికులతో రాజ్‌నాథ్ సింగ్ సమావేశమై ఆపరేషన్ సిందూర్ విజయంపై వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

అపర భగీరథుడుగా పేరు గాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఈరోజు. రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా రైతన్నలు నిత్యం తలచుకునే ఆర్థర్ కాటన్ 1803 మే 15వ తేదీన ఇంగ్లండ్లో జన్మించారు. భారతదేశంలో పనిచేసేందుకు కాటన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉభయగోదావరి జిల్లాలకు దుఃఖ దాయినిగా ఉన్న గోదావరి నదికి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టి గోదావరి జలాలను పంటచేలకు అందించే వరప్రదాయినిగా మార్చారు. గోదావరి నీటికి అడ్డుకట్ట వేసి పంట భూములను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ కు ఉభయ గోదావరి జిల్లాలో నేటికీ అనేక గ్రామాల్లో ఆయన విగ్రహాలను పెట్టి ప్రజలు స్మరిస్తూనే ఉన్నారు.

ఇదిలా ఉండగా సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు నిర్మించి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్‌ఆర్థర్

కాటన్ చేసిన కృషి మరువలేనిదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కాటన్ జయంతి సందర్భంగా మహానుభావుని స్మృతికి నివాళులర్పిస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు.

---------------------------

సర్ ఆర్థర్ కాటన్ గోదావరి నదిపై ఆనకట్టతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో కాలువల నిర్మాణాలకు కృషి చేశారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఈరోజు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పోలవరంతో పాటు అన్ని సాగు, తాగు నీటి ప్రాజెక్టులు, కాలువల పనులకు అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో సైబర్ భదత్ర సేవలను మరింత విస్తృతం చేస్తామని రాష్ట్ర సాంకేతిక సేవలు– ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆధార్ ఆధారిత సేవలకు ఏపీటీఎస్ ఒక నోడల్ సంస్థగా వ్యవహరిస్తుందని చెప్పారు. 26 జిల్లాల్లో ఏపీటీఎస్ కార్యాలయాలని ప్రారంభించనున్నామని ఆయన పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థల్లో ఇంటింటికి కుళాయి పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు పట్టణ గ్రామీణ ప్రాంత పరిధిలోని పటారుపల్లిలో పలు అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమృత్ ప్రాజెక్టు కింద తాగు నీటి కుళాయిల ఏర్పాటుకుసంబంధించిన ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలో చేపట్టిన తాగునీటి పనులు, భూగర్భ డ్రైనేజ్ పనులను ఈ ఏడాది చివరినాటి కల్లా పూర్తి చేస్తామని తెలిపారు.

---------------------------

చేనేత కార్మికుల కోసం ఆరోగ్య భీమా పథకాన్ని వచ్చే నెల నుంచి అమలు చేస్తామని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలో చేనేత సంఘాల ప్రతినిధులతో నిన్న నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు వారానికి ఒకరోజు ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలను ధరించి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

---------------------------

రైతుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కోడూరు మండలంలోని వివిధ ప్రాంతాలలో కోటి 82లక్షల 27 వేల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి నిన్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వ్యవసాయ రంగ అభివృద్ధికి నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపడుతున్నామని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ.. భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా 'తిరంగా యాత్ర' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన ఈ యాత్ర 11 రోజులపాటు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా రేపు విజయవాడలో నిర్వహించే తిరంగా ర్యాలీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ లు పాల్గొంటారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రేపు సాయంత్రం ఇందిరాగాంధీ స్టేడియం నుంచీ బెంజిసర్కిల్ వరకూ ఈ ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతంగా కావడం పట్ల దేశ వ్యాప్తంగాహర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణాజిల్లా మోపిదేవిలో సైనికులకు సంఘీభావంగా మండల పరిషత్, వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీని నిర్వహించారు. మరో వైపు పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడిని స్వాగతిస్తున్నామని తిరుపతి జిల్లాకు చెందిన మాజీ సైనికులు ఆకాశవాణితో మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

జమ్ముకశ్మీర్‌లో పాకిస్తాన్‌తో జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందిన మురళి నాయక్ త్యాగాన్ని జాతి ఎన్నడూ మరిచిపోదని నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ కొనియాడారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయ సిబ్బందితో కలిసి ఆయన నివాళు లర్పించారు ఈ సందర్భంగా ప్రసన్న శ్రీ మాట్లాడుతూ యువత అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

=====================